సాక్షి
వికారాబాద్



9

గురువారం । 2 । అక్టోబర్ । 2025



సందడిగా వస్త్ర దుకాణం

చెడుపై మంచి విజయం

- దసరా వేడుకలకు సర్వం సిద్ధం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు
- కిటకిటలాడిన దుకాణాలు
- పూలు, పండ్లు, గుమ్మడికాయల కొనుగోలులో జనం బిజీ



గుమ్మడి కాయలు కొనుగోలు చేస్తున్న జనం

వికారాబాద్: చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా. ఈ పండుగను హిందువులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొంటారు. గురువారం విజయదశమి కావడంతో జిల్లా వ్యాప్తంగా సందడి వాతావరణం నెలకొంది. హిందూ ఉత్సవ సమితీ ఆధ్వర్యంలో పండుగ నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రావణ దహనానికి సిద్ధమవుతున్నారు. అయితే గాంధీ జయంతి.. దసరా పండుగ ఒకే రోజు రావడంతో ప్రజలు కొంత అయోమయంలో ఉన్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బందులు ఎదురు కాకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పట్టణాలు, ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు ఇప్పటికే సొంత గ్రామాలకు చేరుకున్నారు. పూలు, పండ్లు, వస్త్ర, కిరాణా దుకాణాలు జనంతో కిటకిటలాడుతున్నాయి. ఆయుధ పూజకు సిద్ధమయ్యారు. వాహనాలను శుభ్రం చేసే పనిలో యజమానులు నిమగ్నమయ్యారు. పరిశ్రమల్లో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించనున్నారు. గుమ్మడి కాయలకు డిమాండ్ పెరిగింది.

న్యూస్‌రీల్

విజయదశమి శుభాకాంక్షలు
స్పీకర్ ప్రసాద్‌కుమార్



అనంతగిరి: రాష్ట్ర ప్రజలకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అన్నారు. పండుగ సందర్భంగా ప్రజలు చేపట్టే పనులన్నీ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

విజయాలు వరించాలి
మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి



తాండూరు: విజయదశమి పండుగ విజయాలు అందించాలని మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రజలు విజయాలతో పాటు పాడి పంటలు సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

కొడంగల్ తహసీల్దార్‌గా రాంబాబు



కొడంగల్: కొడంగల్ తహసీల్దార్‌గా రాంబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూస్తామన్నారు. ఇంతకుముందు రాష్ట్ర సచివాలయంలో పని చేసినట్లు చెప్పారు. అక్కడి నుంచి బదిలీపై వచ్చినట్లు తెలిపారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ దీపక్ శ్యాందాస్ జిల్లా కేంద్రానికి బదిలీ అయ్యారు.

కాంగ్రెస్‌కు ఓట్లు అడిగే అర్హత లేదు
మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి



కాంగ్రెస్ బాకీ కార్డు చూపుతున్న నరేందర్‌రెడ్డి

కొడంగల్: హామీల అమలులో విఫలమైన కాంగ్రెస్‌కు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగే అర్హత లేదని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల కోసం రెండు సార్లు మాత్రమే రైతు బంధు ఇచ్చిందన్నారు. హామీ మేరకు ఎకరానికి రూ.15వేలు చెల్లించాలన్నారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో కాలేదన్నారు. మహిళలకు రూ.2,500 చెల్లించలేదన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పింఛన్లు పెంచలేదన్నారు. కొడంగల్‌లో కూడా పూర్తి స్థాయిలో రుణమాఫీ కాలేదన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, నాయకులు మధుయాదవ్, ముదిగండ్ల కృష్ణ, దయాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ఎరన్‌పల్లి శ్రీనివాస్, నర్మద కిష్టప్ప పాల్గొన్నారు.

పోటీకి సిద్ధం

షాద్‌నగర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో ధర్మ సమాజ్ పార్టీ(డీఎస్‌పీ) పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భిక్షపతి అన్నారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని చటాన్‌పల్లి కమ్యూనిటీ హాల్‌లో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజానికి కొత్త నాయకత్వం అవసరముందని.. అది విశారదన్ మహారాజ్ నాయకత్వంలోని డీఎస్‌పీతోనే సాధ్యమన్నారు.

‘మర్యాద’ యాదన్న!

ఇరకాటంలో చేవెళ్ల ఎమ్మెల్యే
- నవాబుపేట సమావేశంలో స్టేజీపై కుర్చీ కేటాయించిన బీఆర్‌ఎస్
- పార్టీ ఫిరాయించకపోతే మీటింగ్‌లకు రావాలని పిలుపు
- స్పందించని కాలె



మంగళవారం నవాబుపేటలో నిర్వహించిన బీఆర్‌ఎస్ సమావేశంలో కాలె యాదయ్యకు వేసిన కుర్చీ

వికారాబాద్: అందరూ మర్యాద యాదయ్యగా పిలుచుకునే చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఇరకాటంలో పడ్డారు. బీఆర్‌ఎస్ బీఫాంపై గెలిచి కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం హస్తం గూటిలో తలదాచుకున్న ఆయనకు స్థానిక ఎన్నికలతో పాటు పార్టీ ఫిరాయింపుల చట్టం ఇరకాటంలో పడేసింది. ఒకే సమయంలో స్పీకర్ నోటీసులు, విచారణ, స్థానిక ఎన్నికల కోడ్ అమలులోకి రావడం లాంటి పరిణామాలు చోటు చేసుకోవడంతో ఎప్పుడూ లేని వింత పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తోంది. మంగళవారం తన సొంత మండలం నవాబుపేటలో జరిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశాన్ని ఆ పార్టీ నేతలు ఎమ్మెల్యే యాదయ్యను ఇరకాటంలో పెట్టేందుకు వాడుకున్నారు. స్టేజ్‌పై కుర్చీ వేసి.. దానికి ఎమ్మెల్యే కాలె యాదయ్య అని పేపరు అతికింది వేదికపైకి రావాలంటూ ఆహ్వానించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

సొంత మండలం నుంచి..

సొంత మండలం నవాబుపేట నుంచి ఎంపీపీగా, జెడ్పీటీసీగా ఆ తర్వాత టీటీడీ బోర్డు సభ్యుడిగా కాలె యాదయ్య ఎదిగారు. కాంగ్రెస్ పార్టీతో తన రాజకీయ ప్రస్థానం ప్రారంభించి మొదటి సారి ఆ పార్టీ నుంచే ఎమ్మెల్యేగా గెలుపొందారు. రాష్ట్రం విడిపోవడం, ఆ తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావడంతో కారు పార్టీలో చేరారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బీంఫారంతో పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలు పొందిన ఆయన కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో హస్తం గూటికి చేరారు. ఒకరు తరువాత మరొకరు పార్టీని వీడుతుండటంతో కారు పార్టీ అలర్టయ్యింది. పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయా లని కోర్టు గడప తొక్కిన విషయం తెలిసింది. చివరకు ఆ వివాదం సుప్రీంకోర్టు పరిధిలోకి వెళ్లడం, ఫిరాయింపు ఎమ్మెలేల విషయంలో ఏదో ఒక నిర్ణ యం తీసుకోవాలంటూ కోర్టు స్పీకర్‌కు సూచించింది. దీంతో ఇటీవల స్పీకర్ ట్రిబ్యునల్ ముందు ఎమ్మెల్యేలు హాజరై వివరణ ఇచ్చారు. వీరిలో కాలె యాయద్య కూడా ఉన్నారు. ఈ పరిణామాలు జరుగుతున్న సమయంలోనే ఎమ్మెల్యే చేవెళ్లలో మాట్లాడుతూ.. తాను పార్టీ మారలేదని, బీఆర్‌ఎస్‌లోనే ఉన్నానని వ్యాఖ్యానించారు. దీన్ని ఆసరాగా చేసుకున్న బీఆర్‌ఎస్ ఇటీవల యాదయ్య సొంత మండలం నవాబుపేటలో జరిగిన సమావేశంలో ఆయనకు గట్టి కౌంటర్ ఇచ్చింది. పార్టీలో ఉంటే స్టేజ్‌పైకి వచ్చి కూర్చోవాలంటూ ఆయన పేరుతో ఓ కుర్చీ వేసి ఎద్దేవా చేశారు. మాజీ మంత్రి సబితారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ తదితరులు హాజరైన కార్యకర్తల సమావేశంలో కార్యక్రమం పూ ర్తయ్యే వరకు కుర్చీ స్టేజ్‌పై అలాగే ఉంచి యాద య్యను ఇరకాటంలో పెట్టే ప్రయత్నం చేశారు.

కుమారుడి జెడ్పీ పీఠం కోసం..

2018 అసెంబ్లీ ఎన్నికల్లో యాదయ్య ఎమ్మెల్యేగా రెండోసారి గెలుపొందగా, 2019లో జరిగినపరిషత్ ఎన్నికల్లో కుమారుడు మొయినాబాద్ జెడ్పీటీసీగా, కోడలు నవాబుపేట ఎంపీపీగా ఎన్నికయ్యారు. ఒకే ఇంట్లో మూడు పదవులు దక్కడంతో యాదయ్య కుటుంబం వార్తల్లోకెక్కింది. ఇదంతా బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్న సమయంలో జరిగిందే. ప్రస్తుతం ఆయన ఎమ్మెల్యేగా ఉండగా పాత సంప్రదాయాన్ని మళ్లీ కొనసాగించేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం. స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయగా చేవెళ్ల నియోజకవర్గంలోని మూడు మండలాలు ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వ్ చేయబడ్డాయి. ఇదే సమయంలో రంగారెడ్డి జెడ్పీ పీఠం కూడా అదే సామాజిక వర్గానికి రిజర్వ్ అయ్యింది. దీంతో చేవెళ్ల మండలం నుంచి కుమారుడిని జెడ్పీటీసీగా బరిలోకి దింపడం ద్వారా జెడ్పీ పీఠంపై కూర్చోబెట్టాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే కుమారుడు కాలె శ్రీకాంత్ ఇటీవల చేవెళ్ల మండల రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరిస్తూ వస్తున్నారు. అయితే ఇలాంటి కీలక సమయంలో ఎమ్మెల్యే యాదయ్యకు స్పీకర్ నోటీసులు ఇవ్వడం.. ఆయనకు పదవీ గండం పొంచి ఉండటం ఆ కుటుంబ సభ్యులను ఆందోళనకు గురిచేస్తోంది.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఎన్నికలకు సహకరించండి

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బందితో సమీక్ష

అనంతగిరి: స్థానిక సంస్థల ఎన్నికలకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ఎన్నికల నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధులు,ఎన్నికల విభాగం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఎన్నికలు సజావుగా జరిగేందుకు సహకరించాలన్నారు. నామినేషన్ల ప్రక్రి య, స్క్రూటినీ, ఖర్చుల వివరాల వంటి వాటి గు రించి తెలియజేశారు. ఎన్నికల సిబ్బంది బాధ్య తలను డీఈఓకు, బ్యాలెట్ బాక్సుల బాధ్యత డీపీఓకు, కోడ్ పక్కాగా అమలుకు ప్రతి మండలానికీ అధికారులను నియమించడం జరిగిందన్నారు. కలె క్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైనా, ఎన్నికలకు విఘాతం కలిగించినా ఫోన్ నంబర్ 084162 35291కు కాల్ చేయాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు సుధీర్, లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి, డీపీఓ జయసుధ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



గరుడ వాహన సేవలో పల్లకీ మోస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

ఘనంగా పెరుగుబసంతం

అనంతగిరి: వికారాబాద్ పట్టణ పరిధిలోని ఆలంపల్లిలో వెలసిన శ్రీ లక్ష్మీ అనంతపద్మనాభ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం పెరుగువసంతం వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పద్మనాభుడు గరుడ వాహనంపై విహరించారు. వికారాబాద్ మున్సిపల్ కార్యాలయం తరఫున స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. కలెక్టర్ ప్రతీక్ జైన్ గరుడ వాహన సేవలో పాల్గొని స్వామి వారి పల్లకీ మోశారు. కార్యక్రమంలో బీసీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, ఆలయ ఈవో నరేందర్, ట్రస్టీ చైర్మన్ పద్మనాభం తదితరులు పాల్గొన్నారు.

అన్ని స్థానాల్లో పోటీ చేస్తాం
బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

అనంతగిరి: స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలోని అన్ని స్థానాల నుంచి పోటీ చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొప్పుల రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ.. బీజేపీ తరఫున జిల్లాలోని అన్ని సర్పంచ్, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ స్థానాలకు అభ్యర్థులను నిలబెట్టనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు గెలుపు లక్ష్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. అనంతరం రాష్ట్ర నాయకులు డాక్టర్ వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యాయని ఆరోపించారు. ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల కన్వీనర్ బాలేశ్వర్ గుప్తా, జిల్లా మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి, జిల్లా నాయకుడు నవీన్ కుమార్, జిల్లా ఎన్నికల కో కన్వీనర్ వెంకటయ్య, అమరేందర్ రెడ్డి, రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శులు పెంటయ్య గుప్తా, మాధవి, జిల్లా ఉపాధ్యక్షులు యాదయ్య, శివరాజ్, సుదర్శన్ గౌడ్, పటేల్ సాయిరెడ్డి, జిల్లా కార్యదర్శిలు రఘుపతి, వెంకట్, జిల్లా సోషల్ మీడియా ఇంచార్జ్ రాఘవేందర్, జిల్లా మీడియా ఇంచార్జ్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణకు కొలతలు తీసున్న అధికారులు

రోడ్డు విస్తరణకు మార్కింగ్
సీఎం నివాసం నుంచి వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు..

కొడంగల్: పట్టణంలోని లాహోటీ కాలనీలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి నివాసం నుంచి వినాయక చౌరస్తా మీదుగా శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు ప్రధాన రహదారిని విస్తరించనున్నారు. ఈ మేరకు మున్సిపల్, ఆర్అండ్‌బీ అధికారులు బుధవారం మార్కింగ్ వేశారు. కొలతలు తీసి గుర్తులు వేశారు. రోడ్డు మధ్యలోనుంచి రెండు వైపులా 30 ఫీట్లు మేర రోడ్డు వేయనున్నట్లు అధికారులు తెలిపారు. దుకాణాలు, ఇండ్ల యాజమానులతో మాట్లాడిన తర్వాత పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఏ మేరకు పరిహారం చెల్లించాల్సి ఉంటుందో ఉన్నతాధికారులు లెక్కగట్టి ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వినాయక చౌరస్తా విస్తరణ

పట్టణంలోని వినాయక చౌరస్తా ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయి. మహబూబ్‌నగర్ – చించోలీ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఈ చౌరస్తాను విస్తరించాలని అధికారులు నిర్ణయించారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ వసతి గృహాలు, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. నిత్యం వేలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. రోజూ రద్దీగా ఉంటుంది. ప్రయాణికులను ఎక్కించుకోడానికి, దించడానికి ఆర్టీసీ బస్సులు కూడా ఇక్కడే ఆగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఈ క్రమంలో రోడ్డును విస్తరించాలని నిర్ణయించారు.

జాగృతి అధ్యక్షురాలికి ఘన స్వాగతం



కందుకూరు: విదేశాల్లో బతుకమ్మ మహోత్సవాలు పూర్తి చేసుకుని వచ్చిన జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కవితను బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో జాగృతి నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను విదేశాల్లోనూ ప్రచారం చేస్తున్న కవితకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్, బాబురావు, సభావత్ గణేశ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న శ్రీదేవిశ్రీకాంత్ దంపతులు

బషీరాబాద్‌: మండలంలోని బాద్లాపూర్‌ గ్రామంలో బుధవారం శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. హనుమాన్‌ ఆలయ పరిసరాల్లో నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చివరి రోజు శివపార్వతుల కల్యాణం వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మార్మోగాయి. మెట్టు సాయిలు ఆధ్వర్యంలో జరిగిన ఈ ఉత్సవాల్లో శ్రీదేవి శ్రీకాంత్‌, మణిమాల ప్రభు దంపతులు కల్యాణం జరిపించారు. ఈ కల్యాణోత్సవానికి గ్రామస్తులు భారీగా హాజరయ్యారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


పోలీస్‌ స్టేషన్‌లో సీజ్‌ చేసిన ఇసుక ట్రాక్టర్లు

యాలాల: కాగ్నానది నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను యాలాల పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బెన్నూరు కాగ్నానదిలో ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని సమాచారం అందడంతో మంగళవారం అర్ధరాత్రి తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో కాగ్నానదిలో రెండు ట్రాక్టర్‌లను గుర్తించి ఠాణాకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బీజేపీని బలోపేతం చేద్దాం
బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్‌


బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్‌ను సన్మానిస్తున్న నాయకులు

కుల్కచర్ల: బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేద్దామని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు కండె గణేష్‌ అన్నారు. బుధవారం మండల కేంద్రానికి విచ్చేసి పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావును కలిసి స్థానిక నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. బీజేపీ శ్రేణులు రానున్న స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలని, అత్యధిక స్థానాల్లో గెలుపొందేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్య, నాయకులు భజరంగ్‌, లక్ష్మీకాంత్‌, హరికృష్ణ, చంద్రలింగం, మైపాల్‌, శ్రీశైలం, హన్మంతు, ప్రవీణ్‌, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

రెండు సీట్లలో పోటీ చేద్దాం
మహరాజుల ఫ్యామిలీ నిర్ణయం

బషీరాబాద్‌: మండల, జిల్లా పరిషత్‌ ఎన్నికల్లో ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలకు పోటీ చేయాలని మహరాజుల ఫ్యామిలీ సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ మేరకు బుధవారం మాజీ ఎమ్మెల్యే నారాయణరావు తన అల్లుడు వెంకటేశ్‌ మహరాజ్‌, అనుచరులతో సమావేశమయ్యారు. కాంగ్రెస్‌ పార్టీ తరఫున ఎంపీపీ, జెడ్పీటీసీ రెండు స్థానాలకు పోటీ చేయాల్సిందేనని వీరంతా ఏకాభిప్రాయానికి వచ్చినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒక వేళ కాంగ్రెస్‌ నుంచి రాకేశ్‌మహరాజ్‌కు బి ఫామ్‌ రాకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా అయినా పోటీ పెట్టాలని అనుచరులు సూచించినట్లు తెలిసింది. ఈ విషయమై పండుగ తర్వాత ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో చర్చించి నిర్ణయం తీసుకుందామని డిసైడ్‌ చేశారు. మొత్తానికి పరిషత్‌ ఎన్నికలు కాంగ్రెస్‌లో గ్రూపు రాజకీయాలకు దారితీసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దసరా పండుగా తర్వాతా ఈ వ్యవహారం మరింతా ముదిరే అవకాశాలు లేకపోలేదు.

110 ఏళ్ల ఆచారం


అఖండ జ్యోతులతో కిట్టుస్వామి


వెలిగించిన అఖండ జ్యోతులు

- కొడంగల్‌లో అఖండ జ్యోతులు దసరా ప్రత్యేకం
- శమీ, ఆయుధ పూజ నిర్వహిస్తున్న దేశ్‌ముఖ్‌ల కుటుంబం

కొడంగల్‌: దసరా వేడుకలు విజయానికి సంకేతం.. ఆచార వ్యవహారాలు.. సంస్కృతిసంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం. మానవ విలువలను కాపాడి సమాజాన్ని ఏకం చేసే దసరా పండుగకు కొడంగల్‌లో ప్రత్యేకత ఉంది. రాజుల కాలం నుంచి వస్తున్న ఈ ఆచారాన్ని దేశ్‌ముఖ్‌ కుటుంబ సభ్యులు ఇప్పటికీ పాటిస్తున్నారు. దసరా నవ రాత్రులను పురస్కరించుకొని పట్టణ పురోహితుడు కిట్టుస్వామి పూజా మందిరంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసే అఖండ జ్యోతులు ఇందుకు సాక్ష్యంగా నిలుస్తున్నాయి. దసరా పండుగ రోజున పట్టణంలో ఏటా దేశ్‌ముఖ్‌ కుటుంబ సభ్యులు శమీ, ఆయుధ పూజను ఘనంగా నిర్వహిస్తారు. 110 ఏళ్లకుపైగా ఈ క్రతువు కొనసాగుతోందని కిట్టుస్వామి తెలిపారు. దివంగత దేశ్‌ముఖ్‌ పార్వతమ్మ హయాం నుంచి ఈ ప్రాంతంలో దసరా ఉత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దేశ్‌ముఖ్‌ పార్వతమ్మ వంశస్తులు దసరా సందర్భంగా రెండు అఖండ జ్యోతులను వెలిగించడం ఆనవాయితీగా వస్తోంది. కిట్టుస్వామి ఇంట్లో వారి పూర్వికుల కాలం నుంచి దేశ్‌ముఖ్‌ కుటుంబసభ్యులు అఖండ జ్యోతులను వెలిగిస్తున్నారు. విజయదశమి రోజున సాయంత్రం దేశ్‌ముఖ్‌ కుటుంబ సభ్యులు గుర్రంపై వచ్చి అఖండ జ్యోతులను దర్శించుకొని శమీ, ఆయుధ పూజకు వెళ్తారు. జ్యోతులకు ప్రత్యేక పూజలు చేసి, పూజలో ఉంచిన ఖడ్గాన్ని తీసుకొని వెళ్తారు. పూజా మందిరంలో ఉన్న దేవతా మూర్తులకు నిత్యం ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తారు. ఇలా చేస్తే దుర్గమ్మ కరుణతో ఈ ప్రాంతం పాడిపంటలు, పశుసంపదతో సస్యశ్యామలంగా ఉంటుందని విశ్వాసం.

‘ఉమ్మడి’ దసరా


సిరిగిరిపేట్‌ రాజ్‌కుమార్‌ ఉమ్మడి కుటుంబం

తాండూరు రూరల్‌: మండల పరిధిలోని సిరిగిరిపేట్‌కు చెందిన సిరిగిరిపేట్‌ రాజ్‌కుమార్‌ వ్యాపారి. పూర్వీకులు తాండూరు పట్టణంలోని నెహ్రూగంజ్‌లో అడ్తీ వ్యాపారం నిర్వహిస్తూ ఇక్కడే స్థిరపడ్డారు. గ్రామంలో కూడా వ్యవసాయం చేస్తుంటారు. రాజ్‌కుమార్‌తో పాటు సోదరులు రవిశంకర్‌, వీరన్న, రమేష్‌ కుమార్‌ నలుగురు అన్నదమ్ముళ్లు అందరూ కలిసి, ఒకే ఇంట్లో ఉమ్మడి కుటుంబంగా నివాసముంటున్నారు. పిల్లలతో కలిసి 15 మంది సభ్యులు ఉన్నారు. ఏటా దసరా రోజున పట్టణంలోని గోశాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. ఆతర్వాత కాళికాదేవి ఆలయంలో అన్నదానం చేస్తారు. పండుగ నేపథ్యంలో హైదరాబాద్‌లో విద్యాభ్యాసం చేస్తున్న ఇద్దరు పిల్లలు కూడా ఇంటికి చేరుకున్నారు. దసరా పండుగను సంతోషంగా జరుపుకొంటామని రమేశ్‌కుమార్‌ తెలిపారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

బషీరాబాద్‌: మండలంలోని కాశీంపూర గ్రామానికి చెందిన పలువురు బీజేపీ, బీఆర్‌ఎస్‌ యువనాయకులు బుధవారం ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. బీజేపీ యువజన సంఘం గ్రామ అధ్యక్షుడు మాలె రాఘవేందర్‌, బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకుడు బీజే వెంకటేశ్‌తో పాటు యువకులను పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు తగిన ప్రాధాన్యం ఇస్తామన్నారు. కాంగ్రెస్‌ పార్టీ తరఫున పోటీ చేసే అభ్యర్థులు, మద్దతుదారులను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ మాధవరెడ్డి, సొసైటీ వైస్‌ చైర్మన్‌ అజయ్‌ప్రసాద్‌, ఏఎంసీ వైస్‌ చైర్మన్‌ చందర్‌నాయక్‌, సొసైటీ డైరెక్టర్‌ శ్రీనివాస్‌ రెడ్డి, వెంకట్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, నర్సిములు, నరేందర్‌, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

మద్యం మత్తులో వివాహితపై అసభ్య ప్రవర్తన

బషీరాబాద్‌: పూటుగా మద్యం తాగిన ఓ వ్యక్తి తన పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు దాడి చేశాడని ఓ వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దామర్‌చెడ్‌కు చెందిన అర్చన, రాజు దంపతులు. మంగళవారం అర్ధరాత్రి ఇంటి పక్కనే ఉండే బోయిన వెంకటయ్య మద్యం మత్తులో తూలుతూ ఇంటికి వచ్చి దివ్యాంగుడైన తన భర్త రాజుపై దాడి చేయడంతో పాటు తనతో అసభ్యంగా ప్రవర్తించాడని అర్చన తెలిపారు. ఈ విషయమై తాను రాత్రి 12.30 గంటలకు 100కు కాల్‌ చేసినా పోలీసులు స్పందించలేదని ఆరోపించారు. బుధవారం మధ్యాహ్నం దాటినా పోలీసులు రాకపోవడంతో నేరుగా పీఎస్‌కు వెళ్లి ఫిర్యాదు చేశామని వివరించారు. విషయం మీడియాకు తెలియడంతో ఎస్‌ఐ నుమాన్‌అలీ విచారణ కోసం ఇద్దరు కానిస్టేబుళ్లను పంపించారన్నారు. న్యాయం చేయాల్సిన పోలీసులు దాడి చేసిన వారికే వంతపాడారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ ఘటనపై ఎమ్మార్పీఎస్‌ మండల అధ్యక్షుడు నర్సిములు స్పందించారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోకపోతే పీఎస్‌ ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

రైలు ప్రమాదంలో ఏఎస్‌ఐ దుర్మరణం


మారుతి (ఫైల్‌)

తాండూరు: విధులకు వెళ్లేందుకు రైలు ఎక్కుతున్న కర్ణాటక రాష్ట్ర పోలీసు శాఖకు చెందిన ఏఎస్సై రైలు ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన స్థానిక రైల్వే స్టేషన్‌లో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని చించోళి తాలూకా మర్పల్లికి చెందిన మారుతి(49) కల్బుర్గి జిల్లాలోని జేడీ హల్లి పోలీస్‌ స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. స్వగ్రామానికి వచ్చిన మారుతి తిరిగి విధులకు వెళ్లేందుకు తాండూరు రైల్వే స్టేషన్‌కు వచ్చాడు. రైలులో కల్బుర్గి వెళ్లేందుకు యశ్వంత్‌పూర్‌ రైలు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి రైలు కింద పడ్డారు. దీంతో మారుతి రెండు కాళ్లు విరిగిపోయి తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయం గమనించిన రైల్వే పోలీసులు వెంటనే అతన్ని జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం కల్బుర్గి జిల్లాకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతు బుధవారం మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్‌ఐ హరిప్రసాద్‌ తెలిపారు.

అనుమానంతో భార్యను హత్య చేసిన భర్త

కొడంగల్‌ రూరల్‌: అనుమానంతో భార్యను కడతేర్చిన సంఘటన మండల పరిధిలోని చిన్ననందిగామలో బుధవారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాలు.. దుద్యాల్‌ మండలంలోని హస్నాబాద్‌కు చెందిన మౌనిక(27)ను చిన్ననందిగామకు చెందిన ఆంజనేయులుకు ఇచ్చి తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిపించారు. ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడితో సంతోషంగా సాగుతున్న వీరి జీవనంలో అనుమానం పెనుభూతంలా మారింది. మౌనిక వివాహేతర సంబంధం సాగిస్తోందంటూ పలుమార్లు పంచాయితీ పెట్టగా పెద్దలు ఇరువురికీ సర్ది చెప్పారు. అయినా తరచూ గొడవలు జరుగుతున్న క్రమంలో బుధవారం ఆంజనేయులు తన భార్య మౌనిక గొంతు నులిమి హత్య చేశాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అర్చన తండ్రి కిష్టప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ జీవీ సత్యనారాయణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

పూడూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన చన్గోముల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ భరత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల నుంచి వికారాబాద్‌ వస్తున్న కారును, మన్నెగూడ నుంచి చేవెళ్ల వైపు వెళ్తున్న ట్యాంకర్‌ ఎదురెదురుగా మండల పరిధిలోని కండ్లపల్లి గేటు సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న చేవెళ్ల మండలం మీర్జాగూడ గ్రామానికి చెందిన ఇబ్రహీంపల్లి మల్లేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని వికారాబాద్‌ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాకీ కార్డే ప్రచార అస్త్రం

- ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇతర పార్టీల వారితో మాట్లాడొద్దు
- జెడ్పీ పీఠాన్ని కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి


కాంగ్రెస్‌ బాకీ కార్డులను విడుదల చేస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు

చేవెళ్ల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు కాంగ్రెస్‌ ఇచ్చిన హామీల బాకీ కార్డు వజ్రాయుధమని.. ఆ కార్డుతోనే ఎన్నికల ప్రచారం చేపట్టి విజయం సాధిస్తామని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని ముడిమ్యాలలో పార్టీ నాయకుడు గోనె కరుణాకర్‌ రెడ్డి ఫాంహౌస్‌లో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. ఎంపీటీసీ, సర్పంచ్‌ ఎన్నికలు ఒకే సారి పెట్టి గందరగోళం సృష్టించారన్నారు. ఆశావాహులంతా కలిసి కూర్చుని గెలిచే అవకాశం ఉన్నవారిని అభ్యర్థిగా ఎంపిక చేసి ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు.. వాటిని అమలు చేయకపోవడాన్ని గుర్తు చేస్తూ కాంగ్రెస్‌ బాకీ కార్డును చూపిస్తే చాలు బీఆర్‌ఎస్‌ విజయం సాధిస్తుందని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వర్లును చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి ఒక్క కోటీశ్వరాలును చూపాలని ఎద్దేవా చేశారు. ఒక్క యూరియా బస్తాకోసం మహిళలు సర్కస్‌ ఫీట్లు చేస్తున్నారన్నారు. పార్టీ శ్రేణులు ఎన్నికలు పూర్తయ్యే వరకు ఇతర పార్టీకు చెందిన వారితో కలిసి తిరగడం, మాట్లాడం మానేయాలని.. ఇది ప్రజల్లోకి చెడు సంకేతాలు తీసుకెళ్తుందన్నారు. తాను భౌతికంగా మాత్రమే వేరే చోట ఉన్నానని.. మనస్సు మొత్తం చేవెళ్ల చుట్టే తిరుగుతుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్‌ రిజర్వేషన్‌ వచ్చిన నాలుగు జెడ్పీటీసీ స్థానాలు చేవెళ్ల, మహేశ్వరం పరిధిలోనే ఉన్నాయని వీటిని గెలిపించి కేసీఆర్‌కు చైర్మన్‌ పీఠం గిఫ్ట్‌గా ఇద్దామన్నారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్‌ మాజీ చైర్మన్‌ పి.కృష్ణారెడ్డి, నియోజకవర్గ నాయకులు ఆంజనేయులు, కనీస వేతన బోర్డు మాజీ చైర్మన్‌ నారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌, నియోజకవర్గ యూత్‌ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, యూత్‌ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌, మాజీ వైస్‌ ఎంపీపీ శివప్రసాద్‌, సీనియర్‌ నాయకులు కరుణాకర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, దర్శన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బంది పెట్టేందుకే సర్కార్‌ కుట్ర


నాంపల్లిలోని అథారిటీ కోర్టు ఎదుట ఫార్మాసిటీ భూబాధితుల నిరసన

ఫార్మాసిటీ భూ బాధితులు

యాచారం: సర్కార్‌ కావాలనే ఇబ్బందులకు గురి చేస్తోందని ఫార్మాసిటీ భూబాధిత రైతులు అవేదన వ్యక్తం చేశారు. కుర్మిద్ద, నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్‌, తాడిపర్తి గ్రామాలకు చెందిన 150 మందికి పైగా రైతులకు పక్షం రోజుల క్రితం అథారిటీ నోటీసులు ఇచ్చిన విషయం విదితమే. రైతులకు సమాచారం లేకుండానే పట్టా భూముల పరిహారాన్ని గత బీఆర్‌ఎస్‌ సర్కార్‌ అథారిటీలో జమ చేసింది. ఈ పరిహారం తీసుకునే విషయంలో అభ్యంతరాలు తెలపాలని అథారిటీ నుంచి రైతులకు నోటీసులు అందాయి. దీంతో అయా గ్రామాలకు చెందిన రైతులు బుధవారం నాంపల్లిలోని అథారిటీ కోర్టుకు హాజరయ్యారు. నోటీసుల్లో తేదీ ప్రకారం ఆథారిటీ వద్దకు వెళ్లగా జడ్జి సెలవులో ఉన్నారని అధికారులు సైతం ఈ రోజు రారని సిబ్బంది రైతులకు తెలియజేశారు. నోటీసులు అందిన తేదీ ప్రకారం అథారిటీ వద్దకు వచ్చామని జడ్జి సెలవు తీసుకుంటే.. అధికారులు ఎవరూ రాకపోతే తమ అభ్యంతరాలు, బాధలు ఎవ్వరికి చెప్పుకోవాలని అవేదన వ్యక్తం చేశారు. ముందే సమాచారం ఇస్తే రాకపోయేవారం కదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అథారిటీ ఎదుట నోటీసులు చూపుతూ బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

రైతులను కోదండరాం సంఘీభావం

నాంపల్లిలోని అథారిటీ వద్దకు వచ్చిన రైతులతో ప్రొఫెసర్‌ కోదండరాం మాట్లాడారు. ఆరు నెలలుగా ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో సర్కార్‌ పోలీసుల బందోబస్తు నడుమ ఫెన్సింగ్‌ వేస్తోందని.. బెదిరింపులకు పాల్పడుతోందని వివరించారు. ఇందుకు స్పందించిన కోదండరాం వెంటనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబుతో మాట్లాడి సమస్యలు తీరుస్తానని భరోసా ఇచ్చారు.

ఆటపాటలతో బతుకమ్మ


బతుకమ్మ వేడుకలో నాయకులు

ఆమనగల్లు: తెలంగాణ సంస్కృతి సంప్రదాయం అయిన బతుకమ్మ సంబురం బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా తీరొక్క పూలతో పేర్చిన పూలగోపురాలను పట్టణంలోని హనుమాన్‌ దేవాలయం ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అనంతరం మహిళలు, యవతులు ఆటపాటలతో సందడి చేశారు. సురసముద్రం చెరువులో నిమజ్జనం చేశారు. వేడుకలకు మున్సిపాలిటీ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేశారు. ఉత్సవంలో మున్సిపల్‌ కమిషనర్‌ శంకర్‌, జాతీయ బీసీ కమిషన్‌ మాజీ సభ్యుడు ఆచారి, సీఐ జానకిరాంరెడ్డి, ఎస్‌ఐ వెంకటేశ్‌, ఉత్సవ కమిటీ సభ్యులు గుర్రం కేశవులు, కండె హరిప్రసాద్‌, దుర్గయ్య, నర్సింహ, అప్పం శ్రీను, మానయ్య, మల్లయ్య, లక్ష్మణ్‌, వస్పుల సాయిలు, భాస్కర్‌, శేఖర్‌ పాల్గొన్నారు.


మర్పల్లి: హనుమాన్‌ మందిరంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు


దోమ: పాలేపల్లిలో పూజలు..


కొడంగల్‌ రూరల్‌: దుర్గామాత మండపం వద్ద పోతురాజుల విన్యాసాలు

జగజ్జననీ.. నమోస్తుతే

దేవీ శరన్నవరాత్రోత్సవాలను పురస్కరించుకొని ఊరూరా అమ్మవారికి విశేష పూజలు నిర్వహిస్తున్నారు. బుధవారం మహిషాసుర మర్దిని అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. వికారాబాద్‌, తాండూరు, పరిగి, కొడంగల్‌ నియోజకవర్గాల్లోని పలు ఆలయాల్లో జగన్మాత వివిధ రూపాల్లో పూజలందుకున్నారు. మండపాల వద్ద అన్నప్రసాద వితరణ, సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగాయి. – సాక్షి, నెట్‌వర్క్‌


అనంతగిరి: వైభవలక్ష్మి ఆలయంలో అమ్మవారు


పరిగి: అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి దంపతులు


ధారూరు: మహిషాసుర మర్దని అవతారం


పూడూరు: పూజలో మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి తదితరులు


కుల్కచర్ల: ఇప్పాయిపల్లిలో సామూహిక కుంకుమార్చన


తాండూరు: కాళికాదేవి ఆలయంలో మున్సిపల్‌ మాజీ చైర్‌పర్సన్‌ స్వప్నపరిమళ్‌


తాండూరు: అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి